# దర్గామిట్ట కతలు

## కూటికి పేదనైనా కులానికి నవాబునే

**యీ** కతలో మాత్రం ముందు యిప్పటి సంగతి చెప్పి ఆనేక నా చిన్నప్పటి సంగతి చెప్తానబ్బా!

మొన్నామధ్య జూలై నెలలో సెలవు మీద మా కావలికెల్లి ఆరాంగా యింట్లో కూచోని కాంతమ్మ దోసెలు తింటా ఉంటే 'మెహమూదా అక్క' వచ్చింది, 'ఏమి నాయినా ఎప్పుడొచ్చినావా?' అంటా పలకరిస్తా.

ఆమెను చూస్తానే 'నిన్ననే అకా. దా. కూచో' అన్నాను అబిమానంగా నవ్వతా.

'నాస్టా చేసినావా అకా' అన్నాను మళ్లా.

'చేసినాను నాయినా. నువు కానీ' అంటా గాడ్రేజు కుర్చీలో కూచునింది మెహమూదా అక్క.

యింతలోపల మా అమ్మ వచ్చింది,

'మెహమూదాకు నీతో పనుందటబయా. ఎప్పుడొస్తావా అని కాసుకోనుంది. ఆ పనేదో రొంత చేసి పెట్టరాదా?' అనింది, రెకమండేషను చేస్తా.

'అయ్యో... దానికి మా అమ్మొచ్చి చెప్పాలంటకా? నువు చెబితే చాలదా! ఏం పనో చెప్పకా?' అన్నాను, నిజ్జంగానే ఆమె ఏమి పని చెప్పినా ఎమ్మెల్యే ప్యాంటేసుకొనెల్లి చేసుకొనొచ్చేద్దామంత కోరికగా.

నా మాటకి మెహముదా అక్క సమాదానం చెప్పకుండా 'రే...హాజీ' అంటా, మా వాకిలి తట్టు చూసి కేకేసింది.

అంతదాకా బయటే కాసుకోనున్న హాజీగాడు నా తట్టు బిడియంగా చూసి నవ్వతా వాళ్లమ్మ పక్కకొచ్చి నిలబడినాడు.

మెహమూదా అక్క హాజీగాడి నడుము మీద చెయ్యేసి దగ్గరకు తీసుకుంటా 'యీడు యీ సమ చ్చరం టెన్తు సెకండు కిలాసులో ప్యాసయినాడు నాయినా. యింక మీదటయ్యే నందల నందల ఫీజులు కట్టి కాలేజీలో చదివించడానికి మనకాడ ముల్లేమీ లేదు, చదువు మానేసి సుకంగా పనేదయినా చూసుకోరా అంటే చదవతానంటే చదవతానని పట్టు పడతా ఉన్నాడు. నా వల్ల యాడవద్దీ? అప్పటికీ దూదేకుల సర్టిఫికేటు యిస్తే ఫీజులు తగ్గతాయని ఎవరో చెబితే దానికి ట్రై చేసినాను. ఎమ్మారో ఆపీసులో అట్టాంటి సర్టిఫికేటు యివ్వాలంటే కరణం కాణ్ణుంచి కాయితం తెచ్చుకోవాలంట. నీకు పుణ్యముంటుంది. ఆ కాయితం యిప్పీ నాయినా' అనింది.

ఆమె మాటలు యినగానే మనసంతా బలే బాదగయిపోయి, నములతా ఉన్న దోసె చేదుగా అనిపించింది.

ఎట్టాంటి వాళ్లకు ఎట్లాంటి రాత రాసినవురా తండ్రీ అనుకుంటా 'అదెంతపనకా. వాణ్ణి యీడే నొదిలి నువు యింటికి పో. మేమిద్దరం పోయేసి ఆ కాయితమేదో తీసుకొచ్చి పెడతాము' అన్నాను.

కాసేపు తాలివాక హాజీగాణ్ణి తీసుకొని సైకిలు మీద బయలు దేరినాము గాని నా మనసు మనసులో లేదు. ఒకప్పుడు నవాబుల లెక్క బతికిన మెహమూదా అక్కోళ్లు యియ్యాల దూదేకుల సర్టిఫికేటు కోసరం దేబిరించాల్సిన 'గతి కొచ్చినారేమిరా అని ఒకటే ఆరాటం అయిపోయింది నాకు.

మెహమూదా అక్కోళ్లు మా నాయినకి దూరపు బందువులవతారు. మొహమూదా అక్క నాయినకు ఒకప్పుడు చాలా ఆస్తులుండేవిగానీ సంసారం పెద్దదయ్యే సరికి ఆయస్నీ తరిగిపోయి చివరకి మెహమూదా అక్కని 'డాన్ టైలర్స్'కు యిచ్చి చేయాల్సొచ్చింది!

మొదులు బెట్టినారు. అయితే ఏమిటికి ప్రయోజనం? వచ్చిన డబ్బంతా చేతిలో నిలిస్తే గదా. సాయంత్రమయ్యిందంటే చాలు వాళ్లనీ యీళ్లనీ కూచోబెట్టుకొని తాగడమే పని డాన్ టైలర్స్‌కి.

'ముగ్గురు బిడ్డలు ఉన్నారు. వాళ్ల మొహం చూసయినా మానరా సామీ' అని మెహమూదా అక్క ఎంత చెప్పినా డాన్ టైలర్స్ దారికి రాలా. పొగులు పూటంతా మెహమూదా అక్కతో మరేదగా, నవ్వతా ఉండేవాడు గానీ సాయింత్రం గుక్క నోట్లో పడంగానే సావ మొకడం మొదులుబెట్టేవాడు.




'డాన్ టైలర్స్' అసలు పేరు మాకెవ్వరికీ తెలియదు. మాకేకాదు మా ఊళ్లో చాలామందికి తెలియదు. ఆయన్ని పిలవాలంటే అందరం ఆయన టైలరింగు షాపు పేరుతోనే పిలిచేవాళ్లం. ('డాన్' సినిమా రిలీజయ్యి కలెక్షన్లు అద్దరగొడతా ఉన్న రోజుల్లో ముచ్చటపడి తన టైలరింగు షాపుకి 'డాన్ టైలర్స్' అని పేరు పెట్టుకున్నాడంటాయన).

డాన్ టైలర్స్ సామాన్యుడు కాదు. మా ఊళ్లో షాపు పెట్టిన కొత్తల్లో మిషను జోలికే పోకుండా ఉత్త చేతి కుట్టుతోనే ప్యాంట్లు కుట్టి అందరి నోళ్లూ నెళ్లబెట్టేలా చేసినాడు. ఆ దెబ్బతో ప్యాషనంటే డాన్ టైలర్స్‌దే అని, పనిమంతుడంటే డాన్ టైలరేనని మా ఊరి పోగ్గాళ్లంతా ఆయన కాడికి విరగబడడం

ఆయన చేతిలో తన్నులు తింటా, ముగ్గురు బిడ్డలతో అగచాట్లు పడతా నానా సావు సస్తా ఉండేది మెహమూదా అక్క.

రామ రామ డాన్ టైలర్స్ ఆగడాలు మరీ ఆలవిగాకుండా పోయి, మెహమూదా అక్క సావు దెబ్బలు తింటా ఉందని తెలిసినాక ఆమె అన్నయ్యలు దిగినారు నెల్లూరు నుంచి. వాళ్లయినా ఎంత కాలమని సయిస్తారు? రావడం తోటే పెద్ద రచ్చ పెట్టుకునేసినారు.

'తాగుడు మాని సక్కరంగా కాపరం చేసుకోకపోతే మిషను తొక్కడానికి కూడా లాకుండా కాళ్లు యిరగ్గొడ్తామని' బెదిరించి, బతిమిలాడి ఎళ్లినారు.

యిది జరిగినాక కొంతకాలం పాటు డాన్ టెలర్స్

అదువులోనే ఉండివాడు గానీ మళ్లా ఉన్నట్టుండి మెహమూదా అక్కతో తకరారు పెట్టుకున్నాడు. ఆ తకరారు పెరిగి పెద్దదయ్యే సరికి యింకేమనుకున్నాడో ఏమో ఆదేరోజు అలిగి, ఎటో ఎల్లిపోయినాడు.

అంతే. యియ్యాల్టికి పన్నెండేళ్లవుతున్నా యింటికి తిరిగి రాలా! ఆయన యాడున్నాడో కూడా ఎవురికీ తెలీలా.

పాపం ఆరోజు నుంచి ఈరోజు దాక మెహమూదా అక్క ఎన్ని బాధలు పడిందో, ఎన్ని అగచాట్లు పడి బిడ్డల్ని సాక్కుందో పైనున్న ఆ దేవుడికి తెలుసు. కింద మెహమూదా అక్కకు తెలుసు.

మెహమూదా అక్క బలే ఆత్మాభిమానం గల మనిషి. బర్త లాకపోయినా ఒక్కరోజు కూడా బంధువుల పంచనగానీ, అన్నల పంచన గానీ చేరలా. ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తా ఆ వచ్చిన డబ్బులతోటే ఎట్నో యింటిని నెట్టుకొచ్చేది గానీ ఏనాడూ ఎవుర్నీ చెయ్యి సాపి రూపాయి అడిగేది కాదు. మా యింటికొచ్చి మమ్మల్ని సాయమడగడం కూడా యిదే పస్టు సారి.

అందుకనే ఎట్టాగయినా చేసి హాజీగాడికి (మొదటి యిద్దరు మొగ పిలకాయలు చదువు మానేసి పనుల్లో చేరిపోయినారు. హాజీగాడు ఆఖరోడు) దూదేకుల సర్టిఫికేటు యిప్పించాలని మా అమ్మకు దూరపు బంధువైన కరణం సాలేహా యింటికి పోయినాము.

సాలేహా కొడుకు నాకు పరిచయమే. ప్రస్తుతం కాయితాలిచ్చే పని అతనే చేస్తా ఉన్నాడు. నేను అతణ్ణి యింటిలో నుంచి బయిటికి పిలచక వచ్చి, హాజీని చూపిస్తా, యిట్టిట్టా సంగతీ 'యీ పిల్లోడు చాలా బీదవాడు. తండ్రి లేని బిడ్డ. నువ్వు ఎట్టాగయినా చేసి యీడికి దూదేకుల సర్టిపికేటు యిప్పించినావంటే ఏవో నాలుగు ముక్కలు చదువుకుని బతుక్కునేస్తాడు' అన్నాను.

నా మాటలు పూర్తి కాక ముందరే, యింకేమీ మాట్లాడొద్దన్నట్టుగా చెయ్యడ్డం పెట్టి ఆపి, లోపలికి పిలచకపోయినాడు సాలేహా కొడుకు.

అతను కూచునే టేబులు సొరుగులో నుంచి యింతలావున్న పొడుగు పేజీల పుస్తకం బయిటికి తీసి 'పరిస్థితి యిట్టా ఉంటే ఎట్టా యిమ్మంటావు చెప్పు' అన్నాడు, ఏమీ చెయ్యలేని వాడిలాగా మొకం పెట్టి.

'ఏందిది?' అన్నాను, ఏమీ అర్థం గాక.

'దూదేకుల సంఘంవోళ్లు తెచ్చిచ్చిన పుస్తకం. మనూర్లో ఎంతమంది దూదేకులున్నారో సర్వే చేసి వాళ్లకై వాళ్లే లిస్టు తయారుచేసి మాకు తెచ్చిచ్చినారు. ఈ లిస్టులో ఉన్నోళ్ల బిడ్డలకే సర్టిఫికేట్లు యివ్వాలంట. అట్టాగాకుండా సాయిబులగ్గానిస్తే ఎంక్వయిరీ చేసి గొడవ పెట్టేస్తామన్నారు' అన్నాడు.

నేను హాజీ తట్టు, హాజీ నా తట్టు చూసుకున్నాము ఆ మాటలకి- ఏమీ పాలుబోక.

అప్పుడు సాలేహా కొడుకే నాకొక సలహా యిస్తా 'ఒకపని చెయ్యి. యీ లిస్టులో ఉన్న ఎవురో ఒక దూదేకులాయన్ని పట్టుకొని- యి పిల్లోడు మా బంధువుల పిల్లోడే అని రాయించుకొనిరా. కాయితం యిస్తా' అన్నాడు.

కాయితం రాయించుకోవడం తర్వాతి సంగతి గానీ ముందు ఏ దూదేకులాయన్ని పోయి పట్టుకోవాలో నాకు అర్థం కాలా. పుట్టి పెరిగి యిన్నేళ్లు కావస్తున్నా మా వూళ్లో ఒక్క దూదేకులాయనతో కూడా నాకు పరిచయం లేదు. నాకనేకాదు మా బంధువులలో ఎవ్వరమూ దూదేకులోళ్లతో సంబంధాలు పెట్టుకోము. మా ఇళ్లకి పిలిచి టీనీళ్లు కూడా



యియ్యము. పండగ సమాజాలకు వాళ్లు టోపీలు పెట్టుకొని వచ్చినా వాళ్లను వాళ్లు కలవాల్సిందే గానీ మేము పోయి ఈద్ ముబారక్‌లు చెప్పి వాటేసుకోము. యింక పెల్లి సంబంధాలైతే మాట్లాడేదానికే లా. వివరంగా చెప్పాలంటే టెంకరు పని చేసే సాయిబు కూడా జొంకాయలమ్ముకునే దూదేకులాయనతో అంత స్నేహంగా ఉండడు. అంత పాటింపు వుంటుంది సాయిబులకీ దూదేకులోళ్లకి.

యిదంతా ఆలోచించుకున్నాక యింకే పని జరగదని చెప్పి నీరసంగా వచ్చేయబోతా ఉంటే సాలేహా కొడుకు నా బుజం మీద చెయ్యేసి సైకిలు దాకా వచ్చి చెప్పినాడు.

"నువ్వనే కాదు బచ్చే! రోజూ యిట్టా చాలామంది సాయిబుల పిలకాయలు నా దెగ్గరికి వస్తా ఉంటారు. అందరూ పాపం పేద పిలకాయలే. అట్టాగని అందరికీ దూదేకుల సర్టిఫికేట్లు యివ్వలేం గదా. ఎట్టా నువ్వు పేపరాఫీసులో పని చేస్తా ఉన్నావు, యివ్వడిదంతా చూసినావు కాబట్టి రేపు హైదరాబాదెల్లి 'సాయిబులందర్నీ దూదేకులోళ్లనన్నా చెయ్యండి. లాకుంటే దూదేకులోళ్లందర్నీ సాయిబులుగానన్నా చెయ్యండి గాని ఏదో ఒక సావునచ్చి మావోళ్లందరికీ సర్టిఫికేట్లు వచ్చేటట్టు మాత్రం చెయ్యండి' అని రాసి పారెయ్యి. అనేక చూసుకుందాం" అన్నాడు నవ్వతా.

నాకు నవ్వు రాలా. మా నాయిన మీద బలే కోపం వచ్చింది. ఇప్పుడు ఇంత డిమాండు, యింత ప్రాసీజరు వున్న దూదేకుల సర్టిఫికేటును ఉత్త పుణ్యానికి యిస్తామని కాళ్ల దెగ్గిరకి వచ్చిన చాన్సుని కాదనేసినాడే అని కడుపు కాలిపోయింది.

ఎందుకంటే- నేను ఏడో కిలాసులో ఉండగా ఒక రోజు మా మీసాల సుబ్బరాజయివోరు మా నాయిన్ని పిలిపించినాడు ఇస్కూలికి.

ఏమి పనోలే అని వచ్చిన మా నాయిన్ని కూచోబెట్టి "కరీం సాయిబా! రామ రామ బిడ్డల్ని సదివించడం బలే కష్టమైపోతుంది నీ బోటోళ్లకి. యిప్పుడు మీవోడు సెవెన్త్ కిలాసుకు వచ్చేసినాడు. యిదే చాన్సు. 'దూదేకుల' అని రాయించేద్దాము. రేపు సదువుకునేదానికైనా ఉద్యోగం సంపాయించుకునే దానికైనా చానా అసరాగా వుంటుందా సర్టిఫికేటు. మనంగాని యిప్పుడు రాయించకపోతే సైకిలాసుల్లో రాయించడం చానా కస్టం. నా మాట విను" అన్నాడు మీసాల సుబ్బరాజయివోరు.

ఆ మాటలకి మా నాయిన పరాయోళ్ల సొమ్ముని దొంగిలిస్తున్నంత బాధ పడిపోయినాడు.

పొద్దుగూకులా కష్టం చేయమంటే చేస్తాడుగానీ యిట్టాంటి పనులు మా నాయినకు చేతగావు. అంతెందుకూ? మా నాయిన కరెంటు పనోడుకదా. ఇంట్లో తిరిగే కరెంటు మీటారు సంగతి ఆయనకి తెలిసినంతగా యింకెవ్వరికీ తెలియదు గదా. అయినా గాని దానిని వెనక్కి తిప్పే పనిగాని, ఆగిపోయేటట్టు చేసే పనిగాని పెట్టుకునేవోడు గాదు. కరెంటు బిల్లు పెచ్చుగొచ్చినప్పుడల్లా మా అమ్మ నోరు మొత్తుకుని చెప్పినా సరే 'అట్టాంటి నామర్దా పనులు నా దెగ్గిర ఎత్తబాక' అనేసి మా అమ్మ నోరు మూయించేసే వాడు.

అట్టాంటి మనిషి నాకు 'దూదేకుల' అని రాయిస్తాడా? సుబ్బరాజయివోరు ఎంత చెప్పినా వినకుండా- 'వద్దులే సార్. పాపం వాళ్ల పేరున మనమెందుకు బతకాల. వాళ్ల కోటా మనమెందుకు తినాల' అని... అంతలోపల్నే నామోషీగా, గర్వంగా మొకం పెట్టి 'మేము కూటికి పేదవోగాని కులానికి నవాబులమే సార్' అన్నాడు సుబ్బరాజయివోరితో.

మా నాయిన అట్టా అనుకోవడం వల్ల నేను ఫీజులు కట్టి, యింక కట్టలాక డిగ్రీతోటే చదువు ఆపేసినాను.

హాజీగాడు అట్టా అనుకోకపోయినా ఫీజులు కట్టి, యింక కట్టలాక ఇంటరుతోటే ఆపేయడానికి రెడీగా వున్నాడు.

–మహమ్మద్ ఖదీర్‌బాబు